క్లుప్తంగా

మహర్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న కాంబ్లే అశోక్

జైనూర్: రాష్ట్ర ప్రభుత్వం బుద్ధిస్ట్ మహర్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం జిల్లా నాయకుడు కాంబ్లే అశోక్ డిమాండ్ చేశారు. మండలంలోని కొండిబాగూడ గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మహర్ కులస్తుల అభివృద్ధికి జిల్లా కేంద్రంలో బుద్ధిస్ట్ మహర్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. వందేళ్లుగా ఈ ప్రాంతంలో నివసిస్తున్నా ఎలాంటి వసతులు కల్పించడం లేదున్నారు. ఆర్థిక స్థోమత లేక విద్యార్థులు అర్ధంతరంగా చదువు మానేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహర్ కులస్తుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఆయన వెంట నాయకులు ధావనే ప్రకాశ్, కాంబ్లే బాబా సాహెబ్, భూతాశే కిరణ్, సత్యవాన్ ఉన్నారు.

సీపీఎం కార్యాలయంలో సుందరయ్య వర్ధంతి


నివాళులర్పిస్తున్న నాయకులు

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ముంజం శ్రీనివాస్, ముంజం ఆనంద్‌కుమార్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం, తెలంగాణ సాయుధ పోరాటానికి నడిపించిన పోరాట యోధుడు సుందరయ్య అన్నారు. పేద ప్రజల కోసం పోరాటం చేసిన సుందరయ్య అందరికీ ఆదర్శ ప్రాయుడని, ఆయన ఆశయాలను నెర్వాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు రాజన్న, మల్లన్న, సుధాకర్, సాయికృష్ణ, సాయి, నితీశ్, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

కోతలు లేకుండా కొనుగోలు చేయాలి


ధాన్యం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

దహెగాం: ఎలాంటి కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని సిర్పూర్(టి) ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. ఆదివారం మండలంలోని లగ్గాం గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. కొనుగోలు కేంద్రంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ తూర్పార పట్టిన వరి ధాన్యం తప్ప, తాలు పేరిట కోతలు విధించకుండా కొనుగోలు చేయాలన్నారు. మబ్బులు వస్తున్నందున రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. ఈనెల చివరి వరకు కొనుగోళ్లు పూర్తి కావాలని పేర్కొన్నారు. లేని పక్షంలో కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ కోండ్ర తిరుపతిగౌడ్, సీఈవో బక్కయ్య, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నేడు మండల సమాఖ్య సమావేశం

కెరమెరి: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు మండల సమాఖ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఏపీఎం జగదీశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సీసీలు, వీవోఏలతో పాటు 34 వీవో అధ్యక్షులు సకాలంలో హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

భూ కబ్జా ముఠాపై చర్యలు తీసుకోవాలి

చెన్నూర్: పట్టణంలోని గతంలో ఎన్నడూ లేని విధంగా కొందరు వ్యక్తులు ముఠాగా ఏర్పడి నిరుపేదల భూములను కబ్జా చేస్తూ వేధింపులకు గురి చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని బండారి చిన్నన్న అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కుమ్మరిబొగుడ కాలనీలో గల 4 గుంటల భూమిని 2014లో ఎరుకల దేవయ్య అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేసి రిజిష్టర్ చేసుకున్నానని తెలిపారు. ఎనిమిదేళ్ల తర్వాత దేవయ్య, భవాని, గోపినాథ్, వెంకటేశ్ అనే నలుగురు వ్యక్తులు నా భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు గుంటల భూమి ఇస్తావా, లేదంటే రూ.6 లక్షలు ఇవ్వాలని భవాని వేధింపులకు గురి చేస్తుందన్నారు. ఇదేమని అడిగితే ఎస్సీ, ఎస్టీ కేసు న మోదు చేయిస్తానని బెదిరిస్తున్నారని తెలిపారు.

వీవోలకు 'యూనిఫామ్' బాధ్యతలు

- కుట్టు కూలి జతకు రూ.100
- ముందుకొస్తున్న గ్రామైఖ్య సంఘ మహిళలు
- జూన్ 12లోగా అందించాలని అధికారుల ఆదేశాలు


వీవో సభ్యులకు యూనిఫామ్ క్లాత్ అందజేస్తున్న అధికారులు(ఫైల్)



యూనిఫాం కుట్టే విధానం

కెరమెరి: ఓ వైపు ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలి.. మరో వైపు మహిళా సంఘాలను బలోపేతం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వీవో సభ్యులకు చేతినిండా పని కల్పించింది. ఇప్పటి వరకు ఎలాంటి పని లేకుండా టైలరింగ్‌లో నైపుణ్యం ఉండి ఖాళీగా ఉన్న వీవో సభ్యులకు బృహత్తర పనిని ప్రభుత్వం అప్పగించింది. విద్యార్థుల యూనిఫామ్ కుట్టే బాధ్యతలు గ్రామైఖ్య సంఘ మహిళలకు అప్పగించడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రాల నుంచి ఎమ్మార్సీలకు వస్త్రం రాగానే ఆయా కార్యాలయాల సిబ్బంది శనివారం వీవో సభ్యులకు విద్యార్థుల యూనిఫామ్ క్లాత్ అందించారు. నేటి నుంచి యూనిఫామ్‌లు కుట్టడం ప్రారంభించనున్నారు. మండలంలో మొత్తం 83 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, 3420 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి 5924 మీటర్ల వస్త్రం అందింది. మండలంలోని 12 వీవోల పరిధిలో సుమారు 40 మంది గ్రామైఖ్య సంఘ మహిళలు యూనిఫామ్ కుట్టేందుకు ముందుకొచ్చారు.

పెరిగిన కుట్టు కూలి..

గతేడాది వరకు ఒక జత కుట్టు కూలి కేవలం రూ.50 ఉండగా.. ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వం మరో రూ.50 పెంచి రూ.100 చేసింది. గతేడాది వరకు రూ.50 కూలి ఉండగా యూనిఫామ్ కుట్టేందుకు పెద్దగా ఆసక్తి చూపేవారు కాదు. కానీ ఈసారి కుట్టు కూలి పెరగడంతో మహిళలు యూనిఫామ్ కుట్టేందుకు ముందుకొస్తున్నారు. అనేక పాఠశాలల్లో గతేడాది వరకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు టైలర్లకు ఎంతో కొంత అదనంగా సొంత డబ్బులు ఇచ్చేవారు. సమయానికి యూనిఫామ్‌లు అందించాలని ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడులు ఉండడం, రూ. 50 ధరకు టైలర్లు కుట్టేందుకు నిరాకరించడంతో హెచ్‌ఎంలు తీవ్ర అవస్థలు పడ్డారు. అయితే ఈసారి కూలి పెరగడంతో హెచ్‌ఎంలకు తలనొప్పి తగ్గింది.

థాన్‌లుగా వస్త్రం

గతంలో ఒక పాఠశాలలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారో లెక్కలేసి ప్రతీ పాఠశాలకు ఒక బండిల్ చొప్పున వస్త్రం సరఫరా చేసేవారు. దీంతో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఎమ్మార్సీల నుంచి తీసుకెళ్లి తమకు ఇష్టం వచ్చిన టైలర్లకు వస్త్రం ఇచ్చి యూనిఫాం కుట్టించేవారు. కానీ ఈసారి అలా కాకుండా థాన్‌లుగా బట్టలు రావడంతో ఎమ్మార్సీ సిబ్బందికి పని పెరిగింది. వచ్చిన థాన్‌లను పాఠశాలలు, వీవోలు, ఐకేపీ సీసీల వారీగా కత్తిరించి ఇచ్చే బాధ్యతను ఎంఐఎస్ కోఆర్డినేటర్, సీసీవో, సీఆర్‌పీలకు అప్పగించడంతో వారు ఆ పనుల్లో నిమగ్నమయ్యారు.

కొలతల వారీగా కుట్టాలి



కొలతల వారీగా యూనిఫామ్‌లు కుట్టాలి. ఈసారి ప్రభుత్వం కుట్టు కూలి పెంచింది. సైజులు సరిగా ఉండేలా చూడాలని ఆదేశాలు ఇచ్చాం. ఐకేపీ సీసీలు ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి. నిర్ణీత సమయంలోగా యూనిఫామ్‌లు అందించాలి.

\- కుడ్మేత సుధాకర్, ఎంఈవో

12వ తేదీలోగా అందిస్తాం



ఇప్పటికే వీవో సభ్యులు యూనిఫామ్ వస్త్రాన్ని ఎమ్మార్సీ నుంచి అందుకున్నారు. నేటి నుంచి యూనిఫామ్‌లు కుట్టడం ప్రారంభిస్తాం. జూన్ 12వ తేదీలోగా విద్యార్థులకు యూనిఫామ్‌లు అందించాలనే లక్ష్యం పెట్టుకున్నాం.

\- జగదీశ్వర్, ఏపీఎం, కెరమెరి

కలిసి అన్నం తిందామని వెళ్లి..

- కానరాని లోకాలకు..
- బైక్‌పై అదుపు తప్పి యువకుడి దుర్మరణం
- పోచమ్మ జాతరకు వచ్చి నీళ్ల కోసం వెళ్తుండగా ఘటన
- గుండెలు పగిలేలా రోదిస్తున్న కుటుంబ సభ్యులు


గడ్డం రాకేశ్(ఫైల్)

భీమిని: ఎల్లారం పోచమ్మకు మొక్కులు చెల్లించుకునేందుకు ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లిన ఓ యువకుడు దుర్మరణం చెందాడు. పెంచికల్‌పేట్ మండలం గోంట్లపేట్ గ్రామానికి చెందిన గడ్డం రాములు–వెంకటమ్మ దంపతులు తమ ఇద్దరు కుమారులు, బంధువులు, మిత్రులతో కలిసి ఎల్లారం పోచమ్మ దర్శనానికి వెళ్లారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశాడు. మొక్కులు చెల్లించుకున్నాడు. వృత్తిరీత్యా డ్రైవర్ అయిన వీరి చిన్నకుమారుడు గడ్డం రాకేశ్(22) ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా చూడాలని మొక్కుకున్నాడు. అనంతరం ఆలయం సమీపంలోనే విందు చేసుకునేందుకు అందరూ వెళ్లారు. అక్కడే వంటలు చేసుకున్నారు. మధ్యాహ్నం భోజనం చేసేందుకు సిద్ధమయ్యారు.

చల్లని నీళ్ల కోసం వెళ్లి..

అన్నం తినడానికి చల్లని నీరు లేకపోవడంతో తీసుకు వస్తానని, వచ్చాక అందరం కలిసి అన్నం తిందామని కుటుంబ సభ్యులకు చెప్పిన రాకేశ్ తన మిత్రుడు శ్రీకాంత్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై జాన్కాపూర్ వాటర్ ప్లాంట్ వద్దకు బయల్దేరారు. సబ్ స్టేషన్ సమీపంలోని మూల మలుపు వద్ద బైక్ అదుపు తప్పడంతో ఇద్దరూ రోడ్డుపై పడిపోయారు. రాకేశ్ తలకు బలమైన గాయాలు కావడంతో రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీకాంత్ కూడా తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించి బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు.


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు..

డ్రైవర్‌గా పనిచేస్తూ.. కుటుంబానికి అండగా ఉంటున్న రాకేశ్ జాతరకు వెళ్లిన సమయంలో దుర్మరణం చెందిన విషయం తెలియడంతో జాతరకు వచ్చిన వారంతా ప్రమాద స్థలానికి చేరుకున్నారు. అప్పటి వరకు తమతో కలిసి దైవ దర్శనం చేసుకున్న రాకేశ్‌ను రోడ్డుపై విగత జీవిగా చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న కన్నెపల్లి ఎస్సై గగారాం ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హెల్మెట్ ఉండి ఉంటే...

పట్టుమని పాతికేళ్లు కూడా నిండని రాకేశ్, శ్రీకాంత్ జాతరకు వచ్చామన్న సంతోషంలో బైక్‌పై హెల్మెట్ లేకుండా వేగంగా దూసుకెళ్లారు. మూల మలుపు వద్ద బైక్ స్కిడ్ అయిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఇద్దరికీ తలకు గాయాలయ్యాయి. బైక్ నెమ్మదిగా నడుపుతూ హెల్మెట్ ధరించి రాకేశ్ ప్రాణాలు దక్కేవని పేర్కొన్నారు. చిన్నపాటి నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలైందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆర్‌ఎంపీల్లో గుబులు..!

- జిల్లాలోని ఆర్‌ఎంపీ కేంద్రాల్లో అధికారుల తనిఖీలు
- నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై చర్యలు


ఆధ్యశ్రీ (ఫైల్)

కౌటాల మండలం తుమ్మిడిహెట్టి గ్రామానికి చెందిన గోంగ్లె బండు-చైతన్య దంపతుల కుమార్తె ఆధ్యశ్రీ(4)కి గతేడాది అక్టోబర్‌లో జ్వరం రావడంతో మండల కేంద్రంలోని ఓ ఆర్‌ఎంపీ వద్ద వైద్యం చేయించారు. ఆర్‌ఎంపీ సూచన మేరకు స్థానిక ల్యాబ్‌లో రక్తపరీక్షలు చేయించగా టైఫాయిడ్ జ్వరంగా వచ్చిందని, మూడు రోజుల పాటు కోర్సు వాడాలని పాపకు మూడు రోజుల పాటు ఇంజక్షన్లు వేశాడు. కాగా వైద్యం వికటించి మూడు రోజుల అనంతరం చిన్నారి మృతి చెందింది. ఆర్‌ఎంపీ వచ్చీరాని వైద్యం చేయడంతోనే పాప మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆందోళనలు చేశారు.

కౌటాల: రోగులకు సకాలంలో ప్రథమ చికిత్స అందించి పెద్దాసుపత్రులకు పంపించాల్సిన ఆర్‌ఎంపీలు హద్దులు దాటి వైద్యం చేస్తున్నారు. వచ్చీరాని వైద్యంతో రోగులకు వైద్యం చేస్తూ పరిస్థితి విషమించిన తర్వాత పట్టణాల్లోని పెద్దాసుపత్రులకు రెఫర్ చేసి చేతులు దులుపుకుంటున్నారు. దీనికి తోడు వైద్యాధికారుల సూచనల మేరకు పరీక్షలు చేయాల్సిన ల్యాబ్ నిర్వాహకులు నిబంధనలు తుంగలో తొక్కుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా మండల కేంద్రాల్లో ఇష్టానుసారంగా ల్యాబ్‌లు ఏర్పాటు చేసి ఒక్కోరోగి వద్ద రూ.వెయ్యి వసూలు చేసి రక్త పరీక్షలు చేస్తున్నారు. ఆర్‌ఎంపీలు రోగుల నుంచి తీసుకొచ్చిన శాంపిళ్లకు ఎలాంటి జాగ్రత్తలు పాటించకుండా పరీక్షలు నిర్వహించి రిపోర్టు ఇస్తున్నారు. ఆర్‌ఎంపీలు ఇష్టానుసారంగా వైద్యం చేస్తుండడంతో పలువురు అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. దీంతో ఇటీవల జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆర్‌ఎంపీ కేంద్రాల్లో తనిఖీలు చేపట్టారు. దీంతో ఆర్‌ఎంపీల్లో గుబులు మొదలైంది.

ఇష్టారాజ్యంగా వైద్యం..

గ్రామీణ ప్రాంతాల్లోనే కాదు ఆయా మండల కేంద్రాలు, పట్టణ ప్రాంతాల్లో సైతం ఆర్‌ఎంపీలు నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తున్నారు. ఆర్‌ఎంపీల వైద్యం కారణంగా జిల్లాలో పలువురు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. కొందరు ఆర్‌ఎంపీలు ఇష్టారాజ్యంగా క్లినిక్‌లు ఏర్పాటు చేసుకొని క్లినిక్‌లలోనే బెడ్లు ఏర్పాటు చేసుకొని వైద్యం అందిస్తుండగా.. మరి కొందరు రోజూ ఉదయం, సాయంత్రం ద్విచక్ర వాహనాలపై బ్యాగులు వేసుకొని గ్రామాల్లో పర్యటించి వైద్యం అందిస్తున్నారు. జ్వరాల బారిన పడిన వారికి ఏకంగా సెలైన్ బాటిళ్లు ఎక్కిస్తున్నారు. మండల కేంద్రాల్లో ఇష్టానుసారంగా ల్యాబ్‌లు ఏర్పాటు చేసి రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. తమకు తెలిసిన ప్రైవేటు ఆసుపత్రులకు రోగులను పంపించి యాజమాన్యాల వద్ద 20 నుంచి 30 శాతం కమీషన్ తీసుకుంటున్నట్లుగా తెలుస్తోంది.


దహెగాంలోని ఓ క్లినిక్‌లో విచారణ చేస్తున్న అధికారులు(ఫైల్)

అటు తనిఖీలు.. ఇటు గుబులు

అర్హత లేకుండా ఎవరూ వైద్యం చేయకూడదని వైద్య, ఆరోగ్యశాఖ స్పష్టం చేసింది. తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) యాక్ట్ -2010 ప్రకారం ప్రథమ చికిత్స చేసే ఆర్‌ఎంపీలు తమ పేరు ముందు డాక్టర్ అని పెట్టుకోకూడదని ఆదేశించింది. జాతీయ, రాష్ట్ర మెడికల్ కౌన్సిళ్ల ఆధ్వర్యంలో ఐఎంఏ, తానా సభ్యులు, డిస్ట్రిక్ యాంటీ క్వాకరీ బృందాల సహకారంలో ఇటీవల జిల్లాలోని ఆర్‌ఎంపీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేసినట్లు సమాచారం. జిల్లాకు సరిహద్దు మండలం తాండూరులో ఈ నెల 15న ఆర్‌ఎంపీ కేంద్రాల్లో అధికారులు తనిఖీలు చేసి ఎన్‌ఎంసీ (నేషనల్ మెడికల్ కౌన్సిల్) చట్టం ప్రకారం కేసులు నమోదు చేశారు. దీంతో జిల్లాలోని కౌటాల, సిర్పూర్(టి), చింతలమానెపల్లి, బెజ్జూర్, దహెగాం మండలాల్లోని ఆర్‌ఎంపీలకు గుబులు పట్టుకుంది. మండల కేంద్రాల్లో సైతం పదుల సంఖ్యలో ఆర్‌ఎంపీ కేంద్రాలు ఉండడంతో అధికారులు దాడులు చేస్తారన్న సమాచారంతో ముందస్తుగా కొందరు క్లినిక్‌లలోని బెడ్లను తీసివేస్తున్నారు. మరి కొందరు తమ కేంద్రం వద్ద రాసిన క్లినిక్ పేర్లను తొలగిస్తున్నారు. పలువురు ఆర్‌ఎంపీలు ముందు జాగ్రత్తగా కొద్ది రోజుల నుంచి తమ కేంద్రాలను మూసి ఉంచుతున్నారు.

నిరుపయోగంగా పబ్లిక్ టాయిలెట్లు

- ఎల్కపల్లిలో లక్షలు వెచ్చించి నిర్మాణం
- నీటి సరఫరా లేని వైనం
- ప్రజలు, ప్రయాణికులకు తప్పని తిప్పలు


ఎల్కపల్లి బస్టాండ్ ఆవరణలో నిరుపయోగంగా మరుగుదొడ్లు

పెంచికల్‌పేట్: గ్రామ పంచాయతీలో ప్రజల సౌకర్యార్థం లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన పబ్లిక్ టాయిలెట్స్ నీటి సరఫరా లేక నిరుపయోగంగా మారాయి. మండల కేంద్రానికి వచ్చే ప్రయాణికులు, ప్రతీ వారం వారసంతకు వచ్చే ప్రజలు వినియోగించడానికి నిర్మించిన మరుగుదొడ్లకు మరమ్మతులు లేక చెత్తాచెదారంతో నిండిపోతున్నాయి. దీంతో మహిళలు, యువతులు, వ్యాపారులు అత్యవసర సమయంలో అనేక ఇబ్బందులు పడుతున్నారు.

పట్టించుకోని అధికారులు..

పెంచికల్‌పేట్ మండల కేంద్రం గుండా నిత్యం బెజ్జూర్ -కాగజ్‌నగర్ పట్టణాల మధ్య ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసులు నడుపుతున్నారు. నిత్యం ఈ రూట్‌లో అనేక మంది ప్రయాణికులు దూర ప్రాంతాలకు ప్రయాణాలు సాగిస్తుంటారు. ప్రయాణికుల కోసం పెంచికల్‌పేట్‌లో బస్టాండ్ ఆవరణలో గతంలో పంచాయతీ నిధులతో మరుగుదొడ్లు నిర్మించారు. ప్రతీ శుక్రవారం మండల కేంద్రంలో వారసంత నిర్వహిస్తున్నారు. వారసంతకు వచ్చే ప్రజలు, మహిళా వ్యాపారుల కోసం వారసంత సమీపంలో రెండేళ్ల క్రితం గ్రామపంచాయతీ నిధుల నుంచి మరుగుదొడ్లను నిర్మించారు. గత కొంత కాలంగా లక్షలు వెచ్చించి నిర్మించిన మరుగుదొడ్లకు నీటి సరఫరా లేకపోవడంతో వినియోగించడం లేదు. దీంతో చెత్తచెదారం నిండి నిరుపయోగంగా మారాయి. దీంతో బస్టాండ్‌లో మహిళా ప్రయాణికులు, వారసంతకు వచ్చే మహిళా వ్యాపారులు, కొనుగోలు దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లక్షల రూపాయల నిధులతో నిర్మించిన మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని మండల వాసులు డిమాండ్ చేస్తున్నారు.


ఎల్కపల్లి వారసంతలో నిరుపయోగంగా మరుగుదొడ్లు

వినియోగంలోకి తీసుకురావాలి



మండల కేంద్రంలో ప్రజల కోసం నిర్మించిన పబ్లిక్ టాయిలెట్స్‌కు మరమ్మతులు జరిపించాలి. కొన్నేళ్లుగా వినియోగంలో లేకపోవడంతో మండల కేంద్రానికి వచ్చే ప్రయాణికులు, మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకు వచ్చేలా చర్యలు చేపట్టాలి.

\- ఎనగందుల తిరుపతి, సామాజిక కార్యకర్త

గురుకుల సిబ్బందిని మార్చాలి

ఎదులాపురం: విద్యార్థుల సమస్యలను పట్టించుకోని ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని మైనార్టీ గురుకుల బాలుర2 పాఠశాల సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, వారిని వెంటనే మార్చాలని ఇండియన్ యూనియన్ ముస్లీం లీగ్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఫయాజ్ హష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మాట్లాడారు. అక్కడి ఉపాధ్యాయులు విద్యార్థులతో దురుసుగా వ్యవహరిస్తున్నారని, విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ విషయమై డీఎండబ్ల్యూవోకు ఫిర్యాదు చేసినా.. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి సిబ్బందిని మార్చాలని కోరారు.

అంధుడికి అందని 'ఆసరా'

కెరమెరి: పుట్టుకతో అంధుడైన బాలుడికి ఆసరా పింఛన్ అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పింఛన్ ఇప్పించాలంటూ బాలుడి తల్లిదండ్రులు ఏళ్లుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం ఉండడం లేదు. వివరాల్లోకి వెళ్తే.. కెరమెరి మండలంలోని సాకడ గ్రామ పంచాయతీ పరిధి కొత్తగూడ గ్రామానికి చెందిన పెందోర్ జంగు -విమలాబాయి దంపతుల తొమ్మిదేళ్ల కుమారుడు పెందో ర్ రాము పుట్టుకతో అంధుడు. రాముకు సదరం సర్టిఫికెట్ ఉన్నప్పటికీ నేటికీ పింఛన్ అందడం లే దు. అధికారులు స్పందించి పింఛన్ అందేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.


తల్లిదండ్రులతో రాము

దళితుల భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్‌అర్బన్: అమాయకమైన దళితుల భూములను ఆక్రమించుకున్న వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు కేశవ్‌రావ్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బాధితులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. చింతలమానెపల్లి మండలం బాలాజీ అనుకోడ, రేణవెల్లి శివారులో శంకరయ్య సూర్యాదాస్, కొండయ్య, సోమయ్య, రుషి, విజయ్ చెందిన దాదాపు 40 ఎకరాల భూమిని నానయ్య, చిన్నక్క, ప్రేమ్‌కుమార్, నాగేశ్వర్‌రావ్, జయపాల్, పురుషోత్తంలు అక్రమంగా పట్టాలు చేసుకొన్నారని ఆరోపించారు. బాధితులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వారిపై చర్యలు తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు శంకర్, బాధితులు ఉన్నారు.


మాట్లాడుతున్న కేశవ్‌రావ్

కొనుగోళ్ల నిలిపివేత

తాంసి: మండల కేంద్రంలోని సబ్‌మార్కెట్ యార్డులో నేడు జొన్న కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు సీఈవో కేశవ్ తెలిపారు. వర్షం పడే సూచన ఉండడంతో వాతావరణం సరిగ్గా లేనందున కొనుగోలును ఒక రోజు పాటు నిలిపివేయడం జరుగుతుందన్నారు.